
# నా తొలి సినిమా అనుభవం

సి. ఎస్. ఆర్. అంజనేయులు

ఆకాలంలో, నేను అద్దంకిలో 5 వ క్లాసు చదువుకునే రోజుల్లో, మా నాన్నగారి నాటకాభిలాష, నేను పద్యాలు పాటలు నేర్చుకునేటట్టు చేసి, అప్పటినుంచే నటించే ఆసక్తి అంకురించింది. చిత్రనళీయంలో ద్విపదలు మత్తకోకిలలు, సీసాలు ఒకఫక్కీగా చదవటం అనండి, పాడటం అనండి, ఆ రోజుల్లో ఒరవడి. అదినేను చదివే తెలుగు పుస్తకాలలోని పద్యాలను ఆ ఫణితిలో పాడటంవల్ల మేష్టర్లు, ఇతర్లు నన్ను దగ్గరదీసి తినుబండారాలు కొనుపెట్టి ఆదరించేవారు.

శ్రీ టి. వి. సుబ్బారావుగారను హెడ్మాష్టరు నేను ఫస్టుపారం చదువుతున్నప్పుడు, స్కూల్ ఇన్‌స్పెక్టర్ వచ్చినప్పుడు నాకు అర్థంకాకపోయినా ఇంగ్లీషునేర్పి, నాచే షేక్స్పియర్ మర్చంట్ ఆఫ్ వెనిస్‌లో షైలాక్ వేషంవేయించి సంతోషించారు. అప్పుడు నాకు 11 వ ఏడు. ఆనాటినుంచి నాలో నాట్యాసక్తి పెరిగింది.

ఉద్యోగరీత్యా మా నాన్నను ఒంగోలువేశారు. ఇక్కడే స్కూల్ ఫైనల్ పేసయేదాకా ఉన్నాను. పెద్ద వేషాలు వేయాలని ఆశపుట్టింది. ఆ ఊళ్లో మూడు నాటకసమాజాలు. నాకంటె యోగ్యులు, పెద్దనటులు, నేర్పరులు వాటిల్లో ఉండేవారు. ఇప్పటికీ నాటకాలలో వారు గొప్పవారే. ఎవరైనా పెద్దనటుడు నాటకానికి గైరుహాజరైతే ఆవేషం నాచేతవేయించే ఛాన్సువచ్చేది. చదువుమాత్రం పాడుచేసుకోలేదు. తెల్లవారితే ఎస్. ఎస్. ఎల్. సి. సెలక్షన్ పరీక్షలు, ఈరాత్రి నాటకంలో వేషం. మనీ అండ్ కో నోట్సు ఒకపక్క, ఒకపక్క నాటకం



పుస్తకం— ఒకేసారి చదువుకొని ఇందులో అందులోగూడా ఫస్టుగానో, సెకండ్‌గానో వచ్చేవాడిని.

బెజవాడలో కోఆపరేటివ్ ట్రైనింగ్‌లో చేరాను. అదేమి జాతకమోగాని స్కూలు సూపరింటెండెంటు సహకార నాటకం వేయించి, హుడ్‌దొరగూడ మెచ్చుకున్నాడు. "నీకీ ఉద్యోగం ఎందుకు. పో—నాటకాలాడి సంపాదించు" అన్నాడు శ్రీ ముద్దుకృష్ణనాయుడు. ఈయనిప్పుడు మద్రాసులో ఉన్నాడు.

నాటకాలనుంచి సినిమాకు ఇష్టంతో రాలేదు. ఉబలాటంఉన్నా, భయం ఎక్కువైంది. ఎందుకంటే యిప్పటి దృష్ట్యా—అప్పుడు సినిమా అంటే అన్నీ తెలుసుననుకుని, యెవరికీ యేమీ తెలియని కాలంలో అనగా హెచ్. ఎమ్. రెడ్డిగారి కాలంలో నేనూ తెలియనట్టుగానే ప్రవేశించాను. స్టేజిమీద పేరున్న నటులను మాత్రమే తీసుకుంటేనే పెద్ద డైరెక్టర్లు ప్రొడ్యూసర్లు ఔతామనుకొనే రోజుల్లో యడవల్లివారు పద్మాలుగేండ్ల రాముడు వేషం వేశారు. ఆ విగ్గులువేషాలు వికృతాకారం చూచాము. రెడ్డిగారి సావిత్రికి ఒక షోలో రాబడి రూపాయిన్నర. పేరుపోతే నాటకాలకు పిలవరని భయపడి సినిమాలకు రానన్నాను నన్నడిగితే. పోటీ ద్రౌపదులుతీస్తూ, స్టేజీ కృష్ణుడినిగనుక నన్ను, నాటకాల లైసెన్సులన్నీ చేతిలో పెట్టుకొని వేధిస్తూఉన్న కురుకూరి సుబ్బారావుగారు బలవంత పెట్టారు. సినిమాప్రవేశానికి కొన్ని కోరికలు కోరినాను. కృష్ణుడికి ఎక్కువపోర్షను ఉండాలన్నాను. ఒక్కసీనులో గాకుండా భారతం భాగవతం పద్యాలు జరా సంధవధతో తీయాలన్నాను. సరే అని కొల్హాపూర్‌లో నేను దిగగానే వీలు కాదని రెడ్డిగారన్నారు. ఒక్కపద్యం మాత్రం ఉంచారు. సినిమాలకు రానని ఎందుకు వెళ్ళానంటే అప్పటికి పెద్ద నటులు చిత్రానికి 5 వందలే తీసికొంటున్నారు. అడగడంగూడ వారికి తెలియదు. 5 వేలయితే వస్తానన్నాను. అంటే పదింతలు. చాకచక్యములుగల పారేపల్లి శేషయ్యగారు సరేఅన్నారు. అప్పుడు 5 వందలు ఒక ఎకరం.

నేను పిక్చర్‌లో ఫేలయితే పది ఎకరాలు కొనుక్కుని పచ్చిచింతకాయ పచ్చడితో కాలం గడుపవచ్చుగదా అనిన్ని, జయించితే మాబాగేనని.

నేను చిన్నతనంలో చేసిన కొన్ని చేష్టలవల్ల, అంటే అవి నాకు మంచివే అయినా, ఇతరులకు కష్టమైనందువల్ల యిక సినిమాలోకి రానివ్వమని కొందరు బెదిరించారు, సినిమా వాళ్ళ తాతసొమ్ము అయినట్లు, దానికి వారే హక్కుదార్లయినట్లు. కాని, కథ అడ్డంగా తిరిగి యిప్పటికి ముప్ఫయ్ పిక్చర్లుదాకా హీరో, మొదలుకొని అడుక్కు తినేవాడిదాకా, అటు ముసిలేమి ముతకేమి, చిన్నయేమి, ఇటు దుర్మార్గుడేమి అటు హాస్యమేమి-ఏదో ఒక వైవిధ్యంగల వేషం మీ దయవల్ల వేసే అవకాశం కలుగుతోంది. నా పాత్ర ధారణలు మీచేత ఎలా ఆదరింపబడుతున్నాయో మీకు తెలియనిదికాదు. నా తోటివారు పెద్ద నటులు వెనుకబడినప్పటికి, ఏదో మీఅందరి ఆదరాభిమానాలవల్ల మొండిగా ఇంకా సినిమా వేషాలు వేస్తూ లాక్కొస్తూనే యున్నా.

టి. కృష్ణకుమారి

వాహినీస్టూడియో ప్రాంగణంలోకి, నా చిత్రజీవితాన్ని ప్రారంభించుకోడానికి ఆవేళ మధ్యాహ్నం అడుగు పెట్టేను. జ్ఞానాంబికావారి "మంత్రదండం" చిత్రానికి, స్టూడియోలో రాణీశయనమందిరం సెట్ వేశారు. ఆ సెట్ డెకొరేషన్ చాల బాగుంది. డిగ్నిఫైడ్‌గాను, ఆర్టిస్టిక్‌గాను ఉన్న ఆ సెట్‌మీద జిప్సీగరల్‌గా నేను వర్కుచేశాను.

వాహినీ మేకప్‌ఛీఫ్ పీతాంబరం గారు మొట్టమొదటగా నాకు మేకప్ వేశారు. చక్కని గుండ్రని బొట్టు, ఓ బ్యూటీస్పాటూ, పెట్టి, నా ముఖాన్ని చూసి నేనే పొంగిపోయేటంత ముచ్చటగా రంగువేశారు. జిప్సీగరల్‌గా అంత అందం నాలో కనిపించడానికి ఆయనప్రతిభే కారణం.

షాట్‌కోసం లైటింగ్ ఎరేంజిమెంట్సు జరుగుతున్నాయి. నేను సిద్ధంగా కూర్చున్నాను. నా చిత్రజీవిత ప్రారంభపు శుభఘడియలు అవి. ఆ



శుభసమయంలో నవ్వుతూ ఎవరో నడిచి నాదగ్గిరకే వస్తున్నారు. ఎంత పొడుగ్గా ఉన్నారనుకున్నారాయన! ఆ కళ్ళల్లో, ఆ తెల్లనిబట్టల్లో ఆ పొడుగులో ప్రవక్తలు కనుపించారు నాకు. ఎవరోకాదాయన. చక్రపాణిగారే! అంత చనువుగా నాదగ్గరకే వస్తున్నారాయన. వస్తూనే "ఇదేకదమ్మా నువ్వు సెట్టుమీదికి వెళ్ళడం. కంగారు పడక ధైర్యంగా వెళ్లు. కొత్తగా ఫీల్ అవకుండా ఉండు. Wish you good success "అని నన్నుఉత్సాహపరిచారు. ఆయన యిచ్చిన ప్రోత్సాహాన్ని సవినయంగా అందుకుంటూ నమస్కారంపెట్టాను. స్టూడియోలో మొట్టమొదట ధైర్యంచెప్పి ఆశీర్వదించింది చక్రపాణిగారే. ఆతర్వాత విజయా నాగిరెడ్డిగారు నవ్వుతూ అధైర్యపడకుండా బాగా చెయ్యమని ప్రోత్సాహపరిచారు.

షాట్‌కి కావలసిన లైటింగ్ రెడీ అయిపోయింది. చిత్రదర్శకులు శ్రీ కురుమద్దాలి రామచంద్రరావుగారి ఆశీర్వాదాలను అందుకుని నేను సెట్ మీదకి అడుగు పెట్టేను. ఆ సెట్‌లో రాణి హేమలతకి దెయ్యం పట్టింది. ఆ దెయ్యాన్ని వదిలించడంకోసం మాంత్రికుడు శిష్యురాలు భవాని. అంటే నేను నియమించబడ్డాను. అది మిడ్ షాట్. కులదేవత కలశానికి పసుపు కుంకుమలతో నేను పూజ చేస్తూ వుంటాను. ఇదీ—నా చిత్రజీవితానికి నాంది! అప్పుడు మొట్టమొదటగా నేను తాకినవి మంగళప్రదమైన పసుపు కుంకములు. తొలిగా సెల్యులాయిడ్‌లోకి నన్ను రూపొందించిన వారు శ్రీ బోళ్ల సుబ్బారావుగారు. ఈయన ఫోటోగ్రఫి నాకు మరింత గ్లేమర్ పోసింది.

ఆ వేళ ఫ్లోర్‌లో—బి. ఎ. సుబ్బారావు, శివరావు, సి. ఎస్. ఆర్. మొదలైన ప్రముఖులు చాలామంది వున్నారు. సెట్‌లో నా వర్కు అయిపోయింతర్వాత వీరందరూ నన్ను అభిమానంతో అభినందించి ఆశీర్వదించారు.

చిత్రజీవితంలోని నాతొలి అనుభవం—ఎన్నటికీ మరువలేనిఒక మధుర స్వప్నంలా నాలో నిలిచిపోయింది.